# భాషలో విప్లవం

ఆటలు వ్యాయామం కోసం ఏర్పడ్డవి. కాని నేడు క్రికెట్, టెన్నిస్, బాక్సింగ్ మొదలయిన ఆటలు ఒక కళగా, ఒక వృత్తిగా తయారయినవి. "బ్రాడ్‌మన్ రెండువందల పరుగులు తీశాడు. పెర్రీ వరసగా ఇరవై సెట్లు గెలిచాడు. జోలూయీ, ష్మెల్లింగ్ దవడ బద్దలకొట్టాడు" అని సంతోషి స్తున్నాం. ప్రాణాలను నిలబెట్టటానికి భోజనం ఏర్పరచ బడింది. ఎక్కువ తిని ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నాం. భాషకూడా ఈ గతే పట్టింది. అది ఎందుకు పుట్టిందో, దాని ప్రయోజనం ఏమిటో మరచిపోయి, దానికి మెరుగులు వెయ్యటం, నగిషీలు చెక్కటం, రంగులు పుయ్యటం జరుగు తోంది. దీనివల్ల భావం మరుగున పడిపోవటం, అనుకున్న భావం అనుకున్నట్లుగా వ్యక్తం కాకపోవటం జరుగుతోంది.

భాష ఈ స్థితికి ఎందుకు వస్తుంది? సంఘంలో చలనం లేక నూతన భావాలు పుట్టనప్పుడు భాషకు వాపు ఏర్పడు తుంది. చెప్పిందే చెప్పవలసి రావటంవల్ల రచయితలు భాషకు సాము గరిడీలు నేర్పి తమ ప్రతాపం చూపుతారు. భాషచేత సర్కస్ చేయించి ప్రేక్షకులను ఆకర్షించి కరతాళ ధ్వనులకోసం ప్రయత్నిస్తారు. మన భాషలోని, "రాజనందన రాజ రాజాత్మజులు సాటి" మొదలయిన పద్యాలూ, ఏకా క్షరులూ, ద్వ్యక్షరులూ, త్ర్యక్షరులూ ఈవిధంగానే బయలు దేరాయి... ఈ కారణంవల్లనే ఒకరు నిర్వచనోత్తర రామా

యణం రాస్తే, ఒకరు ఉత్తరరామాయణం రాస్తారు. ఒకరు రామాయణం రాస్తే ఒకరు అచ్చతెనుగు రామాయణం రాస్తారు. ఒకరు నృసింహపురాణం రాస్తే, ఒకరు నారసింహ పురాణం రాస్తారు. ఒకరు రాఘవుని చరిత్రా, పాండవుని చరిత్రా వేరువేరుగా రాస్తే, ఒకరు రాఘవ పాండవీయం రాస్తారు. ఈ అవస్థ భావదారిద్ర్యంవల్ల ఏర్పడుతుంది.

"ఏమిటీ హంగామా?" అని ఎవ్వరయినా ప్రశ్నిస్తే, "ఇది గ్రాంధార్వమైన భాష" అనో, "షెల్లీ, పండిత ప్రకాండులకే వ్రాస్తానన్నాడోయ్" అనో, "కళోపాసకునికి వీలైనంత చేరువై, అతని భాషనూ, సాంకేతికాల్నీ అంగీకరించి, అతని సృష్టిలోని రసాన్ని ఆస్వాదించాలి" అనో చెప్పి రచయితలు తప్పించుకోవలసి వస్తుంది.

ఈ వెర్రితలలను సమర్థించుకోటానికి వీరు ఇంకొక పని చేస్తారు. "కళకోసమే కళ" అనే వాదాన్ని లేవదీస్తారు. కళ ఎందుకు పుట్టింది? కళకోసమే పుట్టింది. టెన్నిస్ ఎందుకు ఆడుతున్నారు? ఆడటం కోసమే ఆడుతున్నారు. లూయీ, మెక్మింగ్ దవడ ఎందుకు బద్దలగొట్టాడు? బద్దల గొట్టటం కోసమే బద్దలగొట్టాడు, అనే వాదం లేవదీస్తారు.

కాని ఈ వితండవాదం ఎవ్వరికి నచ్చుతుంది? ఎరువు కాళ్ళమీద ఎన్నాళ్లు నిలబడుతుంది? ప్రజాసామాన్యం, "భాష మానవులు ఒకరి భావాలు ఒకరు తెలుసుకోటానికి ఉపయోగించే ఒక సాధనంగదా! ఇప్పుడు మీరు చేస్తున్న పనేమిటి?" అని ప్రశ్నిస్తుంది.

ఈ ప్రశ్నకు సమాధానంగా రచయితలు మాటి మాటికీ "ప్రజాసామాన్యం, ప్రజాసామాన్యం" అంటు

న్నారు. "ప్రజాసామాన్యం" అంటే ఎవ్వరు? అని తిరుగ ప్రశ్న వేస్తారు. కనుక ప్రజాసామాన్యం ఎవ్వరో చెప్పాలి.

ప్రథమంలో అగ్రజాతి ఒక్కటే చదువుకుంది. అప్పుడు రచయితలు ఆ జాతికి నచ్చే భావాలు దాన్ని ఆకర్షించే భాషలో—వైదిక వాఙ్మయం—వ్రాశారు. రాజులు "నసికులైన" తరువాత వారి రుచులకు అనుగుణంగా వారికి నచ్చే భాషలో-ప్రబంధాలు-వ్రాశారు. తరువాత బూర్జువా వర్గంలో చదువు వృద్ధిచెందింది. అప్పుడు వారికి అర్థమయ్యే భాషలో వారికి ఆనందాన్నిచ్చే భావాలతో బూర్జువా కవిత్వం—భావకవిత్వం—వ్యావహారిక వాదం బయలుదేరినయ్. ఇప్పుడు శ్రామికవర్గంలో చదువు వ్యాపిస్తోంది గనక వారికి అర్థమయ్యే భాషలో, వారి సమస్యలను పరిష్కరించే భావాలతో, వాఙ్మయం నడవాలి.

కాని ఈ పరిణామాన్ని గ్రహించగలిగిన సైంటిఫిక్ దృష్టి వున్నవాడు మాత్రం ఇంతటితో వూరుకోడు.

చదువుకున్న వాళ్ళల్లో ఎక్కువమందికి అర్థమయ్యేటట్టు, నచ్చేటట్టు రాయటానికి ప్రయత్నించేమాట నిజమే! కాని ప్రత్యేకంగా ఆ వర్గానికే నచ్చే భావాలను వెలిబుచ్చుతూ కూర్చోడు.

అంటే బూర్జువా నాగరికత ప్రచారంలో వున్న రోజుల్లో ఈ కవి ఆ భావాలనే ప్రచారం చెయ్యక, తరువాత వచ్చే వర్గానికి లాభాన్ని కూర్చే భావాలను, చదువున్న వర్గానికి నచ్చేభాషలో ప్రచారం చేస్తాడు. అంటే తరువాతి వర్గంలో చైతన్యం కలిగించి విప్లవం లేవదీస్తాడు. తరువాతి

వర్గంలో అప్పటికి ఎక్కువ చదువు లేకపోయినా, చదువు కున్నవాళ్లు ఉపన్యాసాలద్వారానో మరేవిధంగానో చెప్తూ వుంటే విని గ్రహించుకునే స్థితిలో వుంటుంది గనక ఈ పని జరుగుతుంది.

"ఇంతవరకు బాగానే వుందిగాని ప్రజాసామాన్యం అంటే ఈ శ్రామిక వర్గం అని ఎలా చెప్పటం ?"

అన్ని వర్గాలకంటే ఈ వర్గం మెజారిటీ వర్గం గనక. ఈ వర్గమే "ప్రజాబాహుళ్యం" అనిపించుకుంటుంది గనక. ప్రపంచంలోని సమస్యలన్నీ క్రమ క్రమేణా ఈ వర్గం సమస్యలుగానే పరిణమిస్తున్నయ్ గనక. ఈ వర్గానికి అర్థమయ్యే భాష అన్ని వర్గాలకు అర్థమవుతుంది గనక.

"మరి ఈ వర్గాన్ని మనస్సులో పెట్టుకొని, దానికి అర్థమయ్యేటట్లు వ్రాస్తే, అందులో 'కళ' లేదు అంటారే?"

ఈ నిందకు భయపడవలసిన అవసరంలేదు. పురాణాలు మానివేసి ప్రబంధాలు మొదలుపెట్టినప్పుడూ ఇలాగే అన్నారు. ప్రబంధాలు మానివేసి, 'శిష్ట' వ్యవహారం మొదలు పెట్టినప్పుడూ ఇలాగే అన్నారు. ఇప్పుడు వ్యవహారికం మానివేసి గ్రామ్యం రాస్తే ఇలాగే అంటారు. ఎవ్వరి నాగరికతకు భంగం వాటిల్లేటప్పుడు వారు ఏదో ఒక వంకతో గోలపెట్టటం మానవస్వభావం. ఏ వర్గ నాగరికత ఆ వర్గానికి కళగా కనిపిస్తుంది. ఆ నాగరికత పోవలసి వచ్చినప్పుడు "కళ నాశనమౌతోంద"ని గోల పెడుతుంది.

"అయితే కళ అనేదే లేదా ?"

కళలేక ఏమవుతుంది ? దాని స్వరూపం మారుతుంది. ఇప్పుడు పులమటం కళ అయితే, అప్పుడు సూటిగా చెప్పటం కళ అవుతుంది——ఇప్పుడు mysticism కళయితే అప్పుడు realism కళ అవుతుంది. ఇప్పుడు చెవులకు యింపుగా వుండే అలంకారాలతో రాయటం కళ అయితే, అప్పుడు అర్థమయ్యేటట్లు రాయటం కళ అవుతుంది.

కనుక భాషయొక్క ప్రయోజనం ప్రజాసామాన్యానికి భావాలు అర్థమయ్యేటట్లు——నచ్చేటట్లు——చెప్పటం. ఈ ప్రయత్నం ఫలించటమే కళ. మనం మాట్లాడుకోనేటట్లు రాయలేనిమాటా నిజమే ! మాండలిక భేదాలుండేమాటా (ఈ పరిస్థితుల్లో) నిజమే ! కాని మనం అందరికీ అర్థమయ్యేటట్లు మాత్రం వ్రాయగలం. గనుక భాష "మానవులు ఒకరి భావాలు ఒకరు తెలుసుకోటానికి ఉపయోగించే ఒకసాధనం" అని చెబుతాను.

"అయితే పూర్వం ఎప్పుడో మనుష్యులు భావాలను సంజ్ఞలతో తెలుసుకునేవారట ! ఇప్పుడు కొందరు అభినయం ద్వారా భావ ప్రదర్శనం చేస్తున్నారు. ఇంకా అనేకరీతుల భావప్రదర్శనం జరుగుతోంది. ఇవన్నీ భాషలోకేవస్తాయా?" అనే ప్రశ్న వస్తుంది.

రావు. అందుకనే "ఒక సాధనం" అన్నాను.

నే నీ వ్యాసంలో భావం అంటే ఏమిటో, ఎటువంటి భావం గ్రంథార్హమో చర్చించలేదు. వాఙ్మయం ప్రయో

జనకారిగా ఉండాలన్నప్పుడు ప్రయోజనం అంటే ఏమిటో నిర్వచనం చెయ్యలేదు. భాష, శ్రామికులకు భావాలను అర్థం చేసేదిగా మారటంవల్ల అది ఆ వర్గానికి చెందింది కాకుండా ఏ విధంగా పరిణామం పొందుతుందో వర్ణించ లేదు. భాష ప్రయోజనం ఏమిటో, ఇప్పుడది ఏ విధంగా దుర్వినియోగం చెయ్యబడుతూవుందో, వ్రాశాను.